

# ప్రణిహితం

ద్విభాష్యం రాజేశ్వరరావు

"లలితా !

ఈ దినం లక్ష్మివారం !

సాయంకాలం చల్లబడిన తరువాత నువ్వు లక్ష్మీదేవిలా అలంకరించుకొని వయ్యారంగా మీ ఇంటిమెట్లు దిగుతావు. గుబురుగా పెరిగిన మామిడి చెట్ల మధ్యనుండి వనదేవతలా నడిచి వచ్చి గేటు తీసుకొని అమరేశ్వరుని ఆలయంవైపు హంసలా కదిలిపోతావు. మేడమీద గదిలో కిటికీవద్ద నిలబడి, సుతారంగా కదిలిపోతున్న నిన్ను చూస్తూ నేను సర్వం మరిచిపోతాను. నీ ఎదురింటిలో మేడమీది గది దొరకటం నా అదృష్టం కాదూ ? నువ్వు రోడ్డు మళుపు తిరిగి కనుమరుగయ్యేంతవరకూ నేను చూపులు మరల్చుకోలేను. 'మళ్ళీ లక్ష్మివారం ఎప్పుడొస్తుందా ?' అని ఎదురు చూడటంతో నాకు కాలం గడిచిపోతుంది.

మెడలో మత్తుగా నిద్రిస్తున్న చంద్రహారం, నుదుట గుండ్రని తిలకం బొట్టు, గాలికి పిల్లకెరటాల్లా విరిగి నుదటిమీదపడే పట్టులాటి ముంగురులు, ఆసక్తితో నా కోసం మేడవంక చూస్తూ ప్రక్కనుండి ఎవరయినా గమనిస్తారేమోనని భయపడే నీ కళ్ళు; ఇవన్నీ చూస్తూ ఎన్ని దినాలు గడిపేను !!

మన పరిచయం తల్చుకుంటే నాకు ఎంతో విచిత్రమనిపిస్తుంది. నీకు జ్ఞాపకముందా లలితా ?—

ఆ దినం సాయంకాలం నేను కృష్ణానది ఒడ్డున కూర్చొని "చల్లగాలిలో, యమునాతటిపై ... " పాటపాడుతున్నాను. పాట అంతా అయిపోయాక వెనుకనుండి "ఎక్సలెంట్" అంటూ చప్పట్లు కొట్టావు. నేను త్రుళ్ళిపడి వెనక్కు తిరిగి చూశాను. అజంతా మూర్తిలా, ప్రాణం పోసుకున్న సుందరిలా నువ్వు నా వెనుక వయ్యారంగా నిలబడి నవ్వుతున్నావు. నువ్వుకట్టిన గులాబీరంగు చీర సంజె కాంతిలో వింత వెలుగులు చిమ్ముతోంది. కృష్ణనీటిపై పడిన వెలుగు ప్రతిఫలించి నీ కళ్ళలో కాంతులు పులుముతోంది. వదులుగా వేసుకున్న వాల్జడ మెడను చంద్రవంకలాచుట్టి ముందుకు వక్షంమీదకువడి సుతారంగా కదులుతోంది. చెవులకున్న ముత్యాల డ్రాప్స్ అల్లరి చేస్తూ ఊగిసలాడుతున్నాయి. ఆ క్షణంలో నిన్ను చూస్తుంటే నా నోట మాటరాలేదు. నీ సౌందర్యానికి ముగ్ధుడనయి అలాగే వుండిపోయాను. నువ్వు చిలిపిగా దగ్గుతూ నీ ఉనికిని సూచించేవు. నా ప్రవర్తనకు నేను సిగ్గుపడిపోయాను.

నువ్వు నాకు కొంచెం ఎడంగా ఇసుకపై కూర్చుంటూ అన్నావు. "మీరు చాలా బాగా పాడతారు సుమండీ ! మీరు మేడమీది గదిలోంచి పాడుతూవుంటే చాలాసార్లు విన్నాను. కాని ఈనాడు మీ పరిచయ భాగ్యం కల్గింది."

ఆ దినం నువ్వు మాట్లాడినదే




ఎక్కువ. నేను నీ అందాన్ని చూస్తూ అందులో తల మున్కలవుతూ నీ పరిచయం కలుగజేసిన విధాతకు మనసులోనే కృతజ్ఞతలర్పిస్తూ మూగవాడినే అయ్యాను. అదే మన ప్రథమ పరిచయం !

ఆ తరువాత కృష్ణఒడ్డున ఎన్ని సార్లు కల్సుకున్నాం? పగలు ఆఫీసులో పనిచేస్తున్నా మనసుమాత్రం నీ జ్ఞాపకాలనే పలవరించేది. ఆఫీసులో సెకెన్లు నిమిషాలుగా, నిమిషాలు గంటలుగా, గంటలు యుగాలుగా గడిపి సాయంకాలం అయేసరికి కృష్ణా తీరం చేరుకునే వాణ్ణి. అక్కడ కూర్చొని నీవు వస్తావని వేయికళ్ళతో నిరీక్షించేవాడిని ! ఆ నిరీక్షణలో ఎంత ఆనందముంది ?

పాల నురుగులాటి వెన్నెలలో కాన్ని ముంచెత్తుతూ వుంటే నీ గుండెలమీద తలవాల్చి, నీ హృదయంలోని మధుర సందేశాలను వింటూ ఎన్ని దినాలు గడిపేను ! నీ అందమంతా నా స్వంతమయిపోవాలని ఎన్ని కలలు కన్నాను ! నిజం ! నేను నీ కోసమే బ్రతికి వున్నానని పిస్తుంది లలితా !

నేను కన్న కలలన్నీ నిజమవబోతున్నాయి. మన వివాహానికి మన ఇద్దరి తరపు పెద్దలూ అంగీకరించటం పూర్వజన్మ సుకృతంకాక మరేమిటి ? ప్రేమ వివాహాలు కలల్లోనే సాధ్యమనుకునే వాణ్ణి ! కాని వాస్తవంలో కూడా అవి అందంగా నిజమవుతాయని తెలిసి వచ్చింది. ఇంక - కేవలం పది హేను దినాల్లో నువ్వు పెద్దల సమక్షంలో నా దాని వవుతావు ! నేను ఎంత అదృష్టవంతుణ్ణి !..."

* * *

ఇక కొద్దిరోజుల్లోనే నాకు యాభయి అయిదేళ్ళు నిండుతాయి. అంటే - ఇక ప్రభుత్వానికి నేను ఎందుకూ పనికిరాని వాణ్ణవుతాను. ముప్ఫయియేళ్ళుగా నేను, ఆఫీసుకు చేసిన సేవను అందరూ మరిచిపోతారు. ఇంతకాలం అనుబంధం వుటుక్కున తెగిపోతుంది. కొద్ది దినాల్లోనే నేను రిటైరవబోతున్నాను. నాకు ఫించను ఇవ్వటానికి ఉద్యోగం గురించిన వివరాలు కొన్ని ఇవ్వమని ప్రభుత్వంవారు కోరారు.

పాత కర్రపెట్టెతీసి ఈ ముప్ఫయి యేళ్ళనుండి జాగ్రత్తగా కాపాడిన డైరీలుతీసి వెతుకుతున్నాను. వాటి మధ్యనుండి ఒక ఉత్తరం జారిపడింది. మడతవిప్పి చూసేను. అది నేను వ్రాసిన ప్రేమలేఖ ! సరిగ్గా ముప్ఫయి రెండేళ్ళక్రితం లలితకు వ్రాసిన ప్రేమలేఖ !


కళ్ళజోడు సవరించుకొని మళ్ళీ మరొకసారి మొదటినుండి చివరి వరకూ చదివేను. ఆఖరివాక్యం దగ్గర కళ్ళు ఆగిపోయాయి "... నేను ఎంత అదృష్టవంతుణ్ణి ...! "

ఆ వాక్యం చదువుతూ వుంటే కళ్ళు చెమర్చాయి. కళ్ళజోడు తీసి భుజంమీది తువ్వాలుతో కళ్ళు ఒత్తుకున్నాను.

వీధిలో సైకిలు చప్పుడయింది. పెద్దవాడు కాలేజీకి బయలుదేరుతున్నట్లున్నాడు. రెండోపిల్ల వంటిట్లో పెద్దగా శబ్దంచేస్తూ గిన్నెలు సర్దుతోంది. నాలుగోపిల్ల మూడోవాడితో దేనికోసమో తగువుపెట్టుకొని గట్టిగా అరుస్తోంది.

మా శ్రీమతి స్నానం చేస్తున్నట్లుంది !! ఉత్తరం మడిచి చేతితో పట్టుకున్నాను. మనసు గతంలోకి జారింది.

* * *




ఆ ఉత్తరం సగంవరకూ వ్రాసేను. ఆఫీసుకు టయిము అవుతోందని అది ముగించకుండా వదిలేశాను. సాయంకాలం ఆ లేఖను ముగించి లలిత దేవాలయం నుండి వచ్చేటప్పుడు అందజెయ్యాలనుకున్నాను. భార్యాభర్తలకంటె ప్రేయసీ ప్రియులమధ్య వ్రాసుకునే ప్రేమలేఖలు చాలా మధురంగా వుంటాయని ఎక్కడో చదివేను. మనసులోని మాటల్నీ అనుభూతులనూ ఎదుటవారికి చెప్పటానికి లేఖకంటె మంచి సాధన మేముంటుంది ? అందుకే ఆ లేఖ ముగించి లలితకు అందజేయాలనీ, ఆమెనుంచి సమాధానం చదువుకొని పరవశించాలనీ కాంక్షించేను.

కాని — ఆ సాయంకాలం జరిగిన సంఘటన నన్నొక దురదృష్టవంతునిగా మార్చేసింది. అంతవరకూ లోకంలో నా అంత అదృష్టవంతుడు లేడని విర్రవీగేవాడిని. కాని విధి నన్ను అణిచివేసింది.

ఆఫీసునుంచి తిరిగివస్తూ, ఊహలను భవిష్యత్తుకోసం అందంగా మలచుకొంటూ నడుస్తున్నాను. వెనుకనుంచి ఏదో బలంగా తోసివేయటం వరకే తెలుసు !

తరువాత హాస్పిటల్ మంచంమీద కళ్ళు విప్పేను ! నా ఎడం కాలి ఎముక విరిగిందనీ, మోకాలివరకూ తీసెయ్యకపోతే ప్రాణానికి అపాయం వాటిల్లవచ్చుననీ మా నాన్నతో డాక్టరు చెప్తున్నారు. క్షణంసేపు గుండె ఆగినంత పనయింది ! చేతుల్లో ముఖం దాచుకొని పసిపిల్లాడిలా రోదించాను. 'హే భగవాన్ ! అవిటి జీవితాన్ని ఎలా ఊహించటం ?' నాకు మతిపోయినట్లయింది.

నేను హాస్పిటల్ నుండి డిశ్చార్జి అయ్యేసరికి రెండు నెలలు పైగా పట్టింది. ఒక్కనాడు కూడా లలిత కాని, ఆమె తలిదండ్రులు కాని నన్ను చూడటానికి రాలేదు. ఆ తరువాత తెలిసింది. 'లలితకు వాళ్ళ తలిదండ్రులు వేరే సంబంధం నిశ్చయం చేశారని ! త్వరలోనే ఆ వివాహం జరగబోతోందని !'

ఆ వార్త విన్నాక నాకు మెదడు పనిచేయలేదు ! నేను భవిష్యత్తుకోసం పేర్చివుంచుకున్న రంగుల కలలన్నీ సమసిపోయాయి. హాస్పిటల్ బెడ్ మీద జీవచ్ఛవంలా వుండి, కర్రకాలుతో బయట ప్రపంచంలో అడుగుపెట్టాను

* * *

"కాఫీ తీసుకోండి !" అన్న పిలుపుతో ఈ ప్రపంచంలోకి వచ్చాను.

"ఆ ఉత్తరం ఏమిటండీ ?" అంటూ మా ఆవిడ నాకు కాఫీ గ్లాసు అందించింది.

"అబ్బే ! ఏం లేదు !" అన్నాను.

"ఏం ? నేను చూడకూడదా ?" అంది నిష్ఠూరంగా.

"ఇది ముప్ఫయి రెండేళ్ళక్రితం నేను నా ప్రేయసికి వ్రాసిన ప్రేమలేఖ ! చదువుతావా ?" అన్నాను.

"ఇలా ఇవ్వండి" అంటూ మా ఆవిడ ఆ ఉత్తరాన్ని అందుకుంది. "లలితా ! ఆ దినం మనమిద్దరం ఇంట్లోంచి పారిపోయివచ్చి పెళ్ళి చేసుకున్నాం కనుక సరిపోయింది కాని, లేకపోతే మన జీవితాలు ఎలా వుండేవో కదా ?" అన్నాను. నాకు సమాధానం చెప్పకుండా నవ్వుకుంటూ ఉత్తరం చదవటం ముగించింది లలిత ! మడతబెట్టి దాన్ని నాకు అందిస్తూ "నీళ్ళు తోడాను. స్నానానికి లేవండి! ఈ ప్రేమలేఖను మాత్రం భద్రంగా దాచండి !" అంటూ నేను లేచి నిలబడటానికి సాయంచేసి కర్రకాలును ఊతగా నాకు అందించింది.

—————